క్లుప్తంగా

రక్తదానం మహోన్నతం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న తీగల రాజా

రాజమహేంద్రవరం సిటీ: రక్తదానం మహోన్నతమైందని, రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలు కాపాడవచ్చని రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ చైర్మన్ తీగల రాజా అన్నారు. శుక్రవారం స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ 3020 గవర్నర్ పిలుపు మేరకు ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ రక్తదానం ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పలువురు రోటరీ క్లబ్ సభ్యులు రక్తదానం చేశారు. ఇన్ కమింగ్ అధ్యక్షుడు ఇమ్మని వెంకట్, ప్రోగ్రామింగ్ చైర్మన్ ఈశ్వర్ తోట తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు సచివాలయం-1లో శుక్రవారం ఏపీశాక్స్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పవన్‌కుమార్ కళాజాత బృందంచే వీధి నాటకం ద్వారా హెచ్ఐవీ/ఎయిడ్స్, సుఖ వ్యాధులపై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ అంటువ్యాధి కాదని, వ్యాధి సోకిన వ్యక్తుల పట్ల వివక్ష చూపరాదన్నారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ డీఆర్‌పీ రాజశేఖర్, లింక్ వర్కర్ శ్రావణి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కడియం: కడియం సెంటర్‌లో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై కళాజాత బృంద సభ్యులు రాజ్‌కుమార్, లక్ష్మి, కామాక్షి, ఎస్.మేరీ, చిరంజీవి, చలంలు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏఆర్‌టీ సెంటర్ల ద్వారా ఇచ్చే మందులను హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు వాడాలని పాటలతో కళాజాత బృందం వివరించింది. కడియం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.జ్యోత్స్న, సర్పంచ్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేఏ స్ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు శుక్రవారం స్థానిక కోరుకొండ రోడ్డులోని శ్రీలక్ష్మి కర్రీ పాయింట్‌పై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఐదు గృహ సిలిండర్లను వాణిజ్య ప్రయోజనం కోసం వినియోగిస్తుండటంతో అర్బన్ ఎంఎస్‌వో నాగలక్ష్మి వాటిని స్వాధీనం చేసుకున్నారు. కర్రీ పాయింట్ యజమాని బలుసు ఆదినారాయణపై 6ఏ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ డొమెస్టిక్ సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, ఎంఎస్‌ఓ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం


ప్రేమ్‌కుమార్ (ఫైల్)

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హాస్టల్ నుంచి స్కూల్‌కు వెళ్లిన విద్యార్థి తిరిగి రాలేదని స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం-1 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కుంచె దానవబాబు శుక్రవారం త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెద్దాపురానికి చెందిన పల్లల ప్రేమ్‌కుమార్ (12) ఆ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం-1లో ఉంటూ కంటిపూడి రామారావు హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. 19న స్కూల్‌కు వెళ్లిన అతను తిరిగి రాలేదు. దీంతో బంధువుల ఇళ్ల వద్ద, పెద్దాపురంలో అతని ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని దానవబాబు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

జోరుగా.. హుషారుగా..

- హోరాహోరీగా ఆర్పీఎల్ క్రికెట్ టోర్నమెంట్
- సీజన్– 6లో తలపడుతున్న 20 జట్లు


టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సినీనటుడు ఆలీ (ఫైల్)

ప్రకాశంనగర్: యువ కెరటం ఉరకలేస్తుంది.. నువ్వా నేనా అంటూ క్రికెట్ పోటీల్లో తలపడుతోంది.. క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న 'రాజమండ్రి ప్రీమియర్ లీగ్' (ఆర్పీఎల్) క్రికెట్ టోర్నమెంట్ ఆరో సీజన్ ఉత్సాహంగా జరుగుతోంది. దీనికి స్థానిక ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానం, పోలీస్ గ్రౌండ్, ఓఎన్జీసీ గ్రౌండ్ వేదికైంది. ఇటీవల ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ పోటీలను రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుడు, సినీనటుడు ఆలీ, ఎంపీ భరత్‌రామ్‌లు ప్రారంభించారు. మొత్తం నాలుగు విభాగాల్లో జరిగే పోటీల్లో 20 జట్లు తలపడుతున్నాయి. ఈ క్రికెట్ పోటీలు ఇప్పటికే ఐదు సీజన్లు పూర్తి చేసుకుని ఆరో సీజన్‌లోకి అడుగు పెట్టినట్లు ఆర్పీఎల్ నిర్వాహకుడు అజ్జరపు వాసు తెలిపారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన క్రీడా జట్లు పాల్గొంటున్నాయి. ఇందులో డానీ కింగ్స్, బ్లాక్ కెప్స్, ఆర్ స్క్వేర్, నానీ క్రికెట్ అకాడమీ, టీఎస్‌బీ సూపర్ స్టార్స్, రాజా రాయల్స్, ప్రశాంత్ రైజింగ్ స్టార్స్, వెస్ట్ గోదావరి కింగ్స్, జీఎస్‌కే అకాడమీ, ఆర్ఆర్ వారియర్స్, నవీన్ చాలెంజర్స్, చేగువీర యూత్, సురేష్ వారియర్స్, రాజమండ్రి బుల్స్, గుడ్ ఫ్రెండ్స్ క్రికెట్, ఎస్‌పీ ఎల్ఏవేస్, టైటాన్స్, ఫ్రెండ్స్ క్రికెట్ అకాడమీ, అజ్జరపు లయన్స్ జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి.

బంతి బంతికీ ఉత్కంఠ

ఈ పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా పాల్గొంటున్నారు. ప్రతి మ్యాచ్‌లో బంతి బంతికీ ఉత్కంఠ రేగుతోంది. నగరంలోని ప్రధాన క్రికెట్ మైదానాల్లో ఈ ఆర్పీఎల్ టోర్నమెంట్ జరుగుతుండటంతో సందడి వాతావరణం నెలకొంది. ఆర్ట్స్ కళాశాల మైదానంతోపాటు లాలాచెరువు పోలీస్ గ్రౌండ్, ఓఎన్జీసీ గ్రౌండ్‌లో పోటీలను తిలకించేందుకు యువత తరలివస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున చేరుకుని సందడి చేస్తున్నారు. ఈ నెల 19న ప్రారంభమైన ఈ టోర్నమెంట్ మరో 20 రోజుల్లో ఫైనల్స్ చేరుకునే అవకాశాలు ఉన్నాయి. ఇందులో విజేతలకు భారీ నగదు బహుమతులను నిర్వాహకులు అందజేయనున్నారు. ప్రస్తుత సీజన్‌లో మొదటి స్థానం దక్కించుకున్న జట్టుకు రూ.60 వేలు, ద్వితీయ స్థానానికి రూ.30 వేలు, వీటితో పాటు ఆల్ రౌండర్‌కు రూ.15 వేలు, బెస్ట్ బౌలర్‌కు రూ.10 వేలు, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌కు రూ.10 వేలు నగదు బహుమతిగా అందించనున్నారు.

ప్రతిష్టాత్మకంగా పోటీలు



ఆర్పీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఐదు సీజన్లు దిగ్విజయంగా పూర్తి చేశాం. ఆరో సీజన్‌లోనూ ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ముఖ్యంగా క్రీడాకారులకు అవసరమైన క్రికెట్ కిట్లు, జెర్సీలను వారికి అవసరం మేరకు సమకూర్చాం. గతంలో ఆర్పీఎల్‌లో విజయం సాధించిన క్రికెట్ జట్లు, రాష్ట్ర, జాతీయ క్రికెట్ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో పారదర్శకంగా విజేతల ఎంపిక చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

–అజ్జరపు వాసు, క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకుడు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

కడియం: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కడియపులంక శ్రీసత్యదేవా నర్సరీలో పుల్లా ఆంజనేయులు కుమారుడు పుల్లా రాజశేఖర్ జన్మదినం సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో జక్కంపూడి విజయలక్ష్మి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ తదితరులు పాల్గొని రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ ఉల్లి రేవంత్, ఈఎన్‌టీ స్పెషలిస్ట్ ఉల్లి వీరమణి, డాక్టర్ పిండి ఫణికుమార్‌లు వైద్య సేవలు అందించారు.

నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తా..

ఎంపీ మార్గాని భరత్‌రామ్


క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ఎంపీగా రాజమహేంద్రవరం నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, రానున్న ఎన్నికల్లో సిటీ ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శుక్రవారం స్థానిక 22వ డివిజన్ గోదావరి బండ్ రోడ్డు, వంకాయల వారి వీధిలో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అనే విషయాన్ని అడిగారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సిటీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తాను చేసిన అభివృద్ధి నచ్చితే ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ కంటే అద్భుతంగా గోదావరి బండ్‌ను అభివృద్ధి చేస్తానన్నారు. కోటిలింగాల ఘాట్ నుంచి పుష్కర ఘాట్ వరకూ ఘాట్లను ఏకం చేసి అద్భుతమైన లుక్ తీసుకువస్తానన్నారు. రాజమహేంద్రవరాన్ని మరింత సుందర నగరంలా తీర్చుదిద్దుతానని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, కొత్త బాలమురళీకృష్ణ, కొత్త విజయరాజ్యలక్ష్మి, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సూర్య కల్యాణం


సూర్య కల్యాణం జరుపుతున్న నిర్వాహకుడు కుమార్‌శర్మ తదితరులు

సీటీఆర్ఐ: స్థానిక పేపర్‌మిల్లు రోడ్డు సీతంపేటలో షోడశ దిన ప్రయుక్త 'పంచాయతన పూర్వక సూర్యారాధన'లో భాగంగా సూర్య భగవానుడికి విశేష పూజలు, అభిషేకాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా యాగ నిర్వాహకుడు వడలి కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం సూర్యనమస్కారాలు, హోమాలు, శతచండీ పారాయణ, హోమం, సుదర్శన మంత్రానుష్ఠానం, హోమం, శ్రీలక్ష్మీ గణపతి జపం, అష్టద్రవ్య హోమాలు, రుద్రాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. అనంతరం సూర్య కల్యాణం వైభవంగా జరిగింది. ఈ పూజలను తిలకించిన భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వ రోగాలను నివారించే శక్తి సూర్యారాధనలో ఉంటుందన్నారు. శనివారం శ్రీమహాలక్ష్మీ ఆరాధన, జ్యోతిర్లింగార్చన జరుగుతుందన్నారు. 25న ఉదయం 10.30 గంటలకు పూర్ణాహుతి నిర్వహిస్తారన్నారు. భక్తులంతా విచ్చేసి స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కుమార్‌శర్మ పిలుపునిచ్చారు. అనంతరం సుమారు 10 వేల మందికి అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు.

వలంటీర్లే సీఎం జగన్ సైన్యం

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- సేవకులకు పురస్కారాల ప్రదానం


వలంటీర్లకు ప్రోత్సాహక చెక్కును విడుదల చేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

ధవళేశ్వరం: వలంటీర్ వ్యవస్థ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైన్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో–ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం ధవళేశ్వరం జక్కంపూడి సీతారత్నం మెమోరియల్ కమ్యూనిటీ హాల్‌లో రూరల్ నియోజకవర్గానికి సంబంధించి వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా సేవలందిస్తున్న వలంటీర్లను పురస్కారాలతో సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఎవరి సిఫార్సు లేకుండా వారు అందిస్తున్న ప్రజా సేవలను గుర్తించి సన్మానిస్తున్నామన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది పింఛన్‌దారులకు ఒకటో తేదీనే పింఛన్‌ను అందజేస్తున్నారన్నారు. కోవిడ్ వంటి ప్రకృతి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలు అందించారని కొనియాడారు. సేవా వజ్ర అవార్డు పురస్కారం పొందిన ప్రగతి సాదే ప్రేమ, కుడుపూడి చంద్రప్రశాంతి, సేవా రత్న పురస్కారం పొందిన పెంటా జ్యోతి, దాసరి పద్మ, కోసూరి ఉష, విన్నకోట శిరీష, వెంకట శివలక్ష్మి, అల్లంపల్లి లావణ్య, పేకేటి దుర్గాభవాని, మేడిశెట్టి సత్యగౌరిలకు, అలాగే సేవా మిత్ర పురస్కారం పొందిన 867 మందిని సత్కారం చేశారు. రాజమహేంద్రవరం అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తలారి వరప్రసాద్, సత్యం వెంకటరమణ, పట్టపగలు వెంకటలక్ష్మి, కల్యాణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక జక్కంపూడి సీతారత్నం మెమోరియల్ కమ్యూనిటీ హాల్‌లో గ్రామ సంఘాల సహాయకులు, ఆశ వర్కర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మంత్రి వేణు మాట్లాడుతూ ప్రాథమిక విద్య నుంచే ఇంగ్లిష్ మీడియం అందించడంతో పాటు జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను అమలు చేస్తూ సీఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రజారోగ్యం కోసం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ అనేక సంస్కరణలు చేశారన్నారు. రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి చినవీరభద్రయ్య, జేసీఎస్ కన్వీనర్ తడాల చక్రవర్తి, నాయకులు ఎస్.సూరిబాబు, బొప్పన సుబ్బారావు, అంగాడి సత్యప్రియ, ఆచంట వెంకట సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రకాశంనగర్: యూనియన్ బ్యాంక్ ద్వారా తక్కువ వడ్డీకే అందిస్తున్న గృహ, వాహన, విద్య, వ్యక్తిగత రుణాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ వైజాగ్ జోనల్ హెడ్ ఎన్.భాస్కరరావు అన్నారు. శుక్రవారం స్థానిక యూనియన్ బ్యాంక్ డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్ ఆవరణలో జరిగిన రిటైల్ ఎక్స్‌పో ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. బ్యాంక్ డిప్యూటీ జోనల్ హెడ్ సంతోష్ ప్రభూ, డిప్యూటీ రీజినల్ హెడ్ శశికుమార్, రిటైల్ పాయింట్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మేదరపేటలో సారా అమ్ముతున్న దుర్గారావును అరెస్టు చేసి, 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని వన్ టౌన్ ఎస్సై ఆదినారాయణ తెలిపారు.

పేదలకు సంజీవని 'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ'

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ


ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి వేణు గోపాలకృష్ణ, చందన నాగేశ్వర్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పేదల ఆరోగ్యానికి సంజీవనిలా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం నిలుస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక 28వ డివిజన్ మంగళవారపుపేటలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలు అనారోగ్యంతో బాధపడకూడదనే ఉద్దేశంతో దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకానికి రూపకల్పన చేసి ఉచిత వైద్యం అందిస్తే, తండ్రికి తగ్గ తనయుడిగా మరో పది అడుగులు ముందుకేసి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ. 25 లక్షల వరకూ వైద్యం చేయించుకునే విధంగా ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. రూరల్ నియోజకవర్గంలో నగరపాలక సంస్థ పరిధిలోని ఎనిమిది డివిజన్లలో ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను 10 వేల మందికి పంపిణీ చేశామన్నారు. రాష్ట్రంలో గతంలో 11 వైద్య కళాశాలలు మాత్రమే ఉండేవని, డాక్టర్ వైఎస్సార్ హయాంలో ఒక వైద్య కళాశాలను నిర్మించగా, సీఎం జగన్ మరో 17 వైద్య కళాశాలలను మంజూరు చేశారన్నారు. ఇప్పటికే నాలుగు కళాశాలలను ప్రారంభించామన్నారు. మరోవైపు వైద్య శాఖలో 55 వేల పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, ఎంహెచ్‌వో వినూత్న, రాష్ట్ర ఖాదీ బోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ సెక్రటరీ గూడూరి రాధిక, ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బిల్డర్ చిన్న, సచివాలయ కన్వీనర్లు బూరా కనకలింగేశ్వరరావు, కట్టా క్రాంతి, దువ్వాడ గౌరీశంకర్, శంఖం సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిష సదస్సు

ప్రకాశంనగర్: ఎస్ఎస్ లైవ్ ఆస్ట్రో ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక త్రీ స్టార్ మినీ ఫంక్షన్ హాలులో జ్యోతిష సదస్సు జరిగింది. దీనికి ప్రముఖ జ్యోతిష్యుడు నరసింహస్వామి హాజరై సదస్సును ప్రారంభించారు. జ్యోతిష్యులు మున్వర్ బేగ్, శేషారావులు వివిధ రకాల పరిహారాలను వివరించారు. ఎస్వీ రమణారావు, ఎస్ఎస్ కృష్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సుకు నగరం చుట్టుపక్కల నుంచి పలువురు జ్యోతిష్యులు హాజరయ్యారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి


తొర్రేడు హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి వాసుదేవరావు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులు సమయపాలన పాటిస్తూ ప్రణాళికాబద్ధంగా చదివితే పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. శుక్రవారం తొర్రేడులోని జెడ్పీ హైస్కూల్‌ను ఆయన సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రీ పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు లక్ష్య సాధన దిశగా చదవాలన్నారు. ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, రివిజన్ టెస్టులను చక్కగా వినియోగించుకోవాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించాలంటే ఇష్టపడి చదవాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తొర్రేడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను వాసుదేవరావు సందర్శించి ఫార్మేటివ్-4 పరీక్షల నిర్వహణను పరిశీలించి సూచనలు చేశారు. ఒక విద్యార్థితో ప్రశ్న పత్రాన్ని చదివించారు. ప్రాథమిక తరగతుల నుంచి విద్యార్థులు చదవడం, రాయడం పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. హెచ్ఎం ఎం.అనురాధ పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'లో వైద్యసేవలు


జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రోహిత

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి-3 గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 శిబిరంలో 508 మందికి వైద్య సేవలు అందించారు. ఇద్దరిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్స్ చేశారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్, వైద్యులు జి.రోహిత, సమీర అలీ, కె.సబిత, ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ డి.సాంబయ్యలు వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి రక్త, బీపీ, ఈసీజీ పరీక్షలు చేశారు. అనంతరం వైద్యుల సిఫార్సు మేరకు ఉచితంగా మందులు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారంపై ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి ముదునూరి రూప్‌చంద్, సచివాలయ కన్వీనర్లు, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.